## క్లుప్తంగా

### బోధన నైపుణ్యాలపై శిక్షణ

**రాజోలు:** బోధన నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని ఎంఈఓ నల్లి మనోహరం తెలిపారు. మంగళవారం తాటిపాక, కడలి ఉన్నత పాఠశాలల్లో తొలిరోజు శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి వారిని మరింతగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధానోపాధ్యాయులు డి.హరినాథ్, ఆర్ఆర్‌కే ప్రసాద్, రేఖపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు జెడ్పీటీసీ ఆర్థిక సాయం



అంతర్వేదిపాలెంలో నల్లి విజయలక్ష్మికి సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

**సఖినేటిపల్లి:** మండలంలోని వేర్వేరు గ్రామాల్లో మంగళవారం ఇరువురికి స్థానిక జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఖతార్ నుంచి ఆ దేశ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశి కిరణ్ పై మొత్తాన్ని పంపారు. అంతర్వేది పాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న నల్లి విజయలక్ష్మికి, కేశవదాసుపాలెంలో పాదానికి మేజర్ ఆపరేషన్ చేయించుకున్న గెద్దం జాన్‌రావుకు పై మొత్తాలను అందించారు. నాయకులు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్ర, తోటి జాన్‌బాబు, కోనపల్లి వెంకటేశ్వరరావు, మండపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా గ్రామోత్సవం

**సఖినేటిపల్లి:** అంతర్వేది దేవస్థానం గ్రామంలో మంగళవారం కంచుగరుడ వాహనంపై లక్ష్మీ నృసింహుని గ్రామోత్సవం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి సన్నిధిలో పూర్ణాహుతితో ముగిసిన వార్షిక పవిత్రోత్సవాలు పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన ఈ గ్రామోత్సవం నిర్వహించారు. మాఢవీధుల్లో స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అరటిపళ్లు, కొబ్బరి కాయలు నైవేద్యాలుగా సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### డ్రోన్ల తయారీపై విద్యార్థులకు శిక్షణ



వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రోన్లు ప్రయోగిస్తున్న విద్యార్థులు

**కొత్తపేట:** మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా పాఠశాల విద్యార్థులకు డ్రోన్ల తయారీపై శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం వై.చంద్రశేఖరం, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ ఎస్.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అటల్ ల్యాబ్ వర్క్‌షాపు నిర్వహించారు. దీనిలో భాగంగా విశాఖపట్నానికి చెందిన టెక్నికల్ డెవలపర్ ఎం.శ్రీకాంత్, రాజమహేంద్రవరానికి చెందిన టెక్నికల్ ట్రైనర్ పి.నరేష్ విద్యార్థులతో టెక్ టీమ్ సొల్యూషన్స్ పేరుతో సాంకేతిక శిక్షణ ఇచ్చారు. సోమవారం థియరీ క్లాసు, మంగళవారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. దీనిలో ఒక్కో టీమ్‌కు ఐదుగురు విద్యార్థుల చొప్పున 9 టీమ్‌లకు డ్రోన్ల తయారీలో శిక్షణ ఇచ్చి తయారు చేయించారు. ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం పోటీలు నిర్వహించి, తయారీ, ప్రయోగంలో ఉత్తమ టీమ్‌గా నిలిచిన సంజన టీమ్‌ను ఎంపిక చేశారు. ఆ టీమ్‌తో పాటు మొత్తం 9 టీమ్‌ల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్టు అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు తెలిపారు.

### ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా 'నేరేడిమిల్లి'



నేరేడిమిల్లి సత్యనారాయణ

**అయినవిల్లి:** ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా నేరేడిమిల్లి సత్యనారాయణ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వీరవల్లిపాలెం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సత్యనారాయణ ఎన్నికపై పోతంశెట్టి దొరబాబు, పసుపులేటి శ్రీనివాస్, దడాల రాజశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

### ఆర్ఐకి వినతిపత్రం అందజేత

**అయినవిల్లి:** విజయవాడలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ మహా ధర్నాకు హాజరైన వారిని అక్రమ అరెస్టు చేసి అడ్డుకున్న ప్రభుత్వంపై నిరసనగా అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అయినవిల్లి మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నిరసన తెలిపారు. కార్యక్రమంలో మంగాయమ్మ, గౌరీ, మణి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, మంగాదేవి తదితరులు ఉన్నారు.

# కాపు నేస్తంతో ఆర్థిక భరోసా

- 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు వరం
- ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం



వైఎస్సార్ కాపు నేస్తం చెక్కు పంపిణీ చేస్తున్న జేసీ నూపుర్ అజయ్ (ఫైల్)

**మామిడికుదురు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కాపు నేస్తం పథకం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన కాపు, బలిజ, ఒంటరి, తెలగ వర్గాలకు చెందిన మహిళలు నాలుగేళ్ల నుంచి ఆర్థికసాయం పొందుతున్నారు. ఈ పథకం ఎంతో మంది పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఏడాదికి రూ.15 వేల వంతున ఆర్థిక సాయం పొందుతున్న మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఈ విధంగా కాపు కులాలకు మేలు జరిగిన సందర్భాలు లేవని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్ల పాలనలో రూ.75 వేల సాయం అందించడం ముదావహమని పేర్కొంటున్నారు. కాపులు ఉన్నత వర్గాలకు చెందిన వారన్న ముద్రను చెరిపేస్తూ వారిలోను మెజార్టీ వర్గాలు నిరుపేదలు ఉన్నారన్న సత్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి తమకు ఆర్థిక సాయం అందించడం చాలా ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు.

**19,991 మంది లబ్ధిదారులు... రూ.30.02 కోట్లు సాయం**

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా నాలుగో విడతలో 19,991 మందికి ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది కాపు నేస్తం ద్వారా మూడు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు రూ.30.02 కోట్లు ఆర్థిక సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. గతంలో మాదిరిగా ఏ ఒక్కరో సాయం అందుకోవడం కాకుండా ఈ పథకం ద్వారా ప్రతి ఇంట్లోని మహిళకు ఆర్థిక సాయం నేరుగా అందుతుంది. ఎవరి సాయం అవసరం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఆర్థిక సాయం అందిస్తున్న తీరు అమోఘమని మహిళలు పేర్కొంటున్నారు.

**రూ.60 వేల సాయం అందింది**



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా నాకు నేటి వరకు రూ.60 వేలు ఆర్థిక సాయం అందించారు. ఏడాదికి రూ.15 వేలు వంతున నా బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా సాయం అందించిన సందర్భం లేదు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాపులకు అండగా నిలిచారు.

– కొమ్ముల గంగాభవాని, పెదపట్నంలంక

**అన్ని కులాలకు సమన్యాయం**



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలకు సమన్యాయం చేస్తున్నారు. గతంలో మాదిరిగా ఏ ఒక్క కులానికి సంక్షేమ పథకాలను పరిమితం చేయలేదు. ముఖ్యంగా కాపులకు జగన్ ఎంతో అండగా నిలిచారు. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జగన్‌కే దక్కింది.

– నామన వరలక్ష్మి, మగటపల్లి

**సంక్షేమ పథకాలకు కేరాఫ్ జగన్**



సంక్షేమ పథకాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అందుకే ప్రజల్లో జగన్‌కు తిరుగులేని ఆదరణ లభిస్తోంది. రాజకీయ లబ్ధి కోసం ఎవరు ఎన్ని చెప్పినా జగన్ ముందు సరితూగలేరు. నాతో పాటు ఇది ప్రజలందరి మాట.

– జక్కంపూడి నాగలక్ష్మి, ఆదుర్రు

## బీసీ జనగణన నిర్ణయంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి

**రాజోలు:** బీసీ జనగణనపై ఆరుగురు సభ్యులతో కూడిన సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం ఏర్పాటు చేశామని బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణు అసెంబ్లీలో ప్రకటించడంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు తాటిపాకలో సమావేశమయ్యారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి మాట్లాడుతూ బీసీ జనగణనపై అసెంబ్లీలో జరిగిన చర్చలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ బీసీ జనగణన చేయడం ద్వారా జరిగే ప్రయోజనాలను వివరించడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అనేక మార్లు బీసీ సంఘాలు బీసీ జనగణన చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో బీసీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. బీసీ జనగణన చేసేందుకు ప్రత్యేక జీఓ విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, స్వర్ణకార సంఘ రాష్ట్ర నాయకుడు దార్ల పెదబాబు తదితరులు మాట్లాడుతూ బీసీ జన గణన చేయడం ద్వారా దామాషా పద్ధతి ప్రకారం రాజకీయంగా, సామాజికంగా బీసీలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. బీసీ జన గణనపై అసెంబ్లీలో చర్చించిన మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, బీసీ సంఘ నాయకులు గుబ్బల మనోహర్, కంచి వెంకటరమణ, కడియం పూర్ణచంద్రరావు, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌరాణిక నాటకాలకు సంగీతమే ప్రాణం



వాడపాలెంలో క్రిష్ణను సత్కరించి కిలార్‌నెట్‌కు సువర్ణ రూపులు తగిలిస్తున్న జూనియర్ డీవీ

**కొత్తపేట:** పౌరాణిక రంగస్థల నాలకాలకు స్టేజీ ముందు హార్మోనియం, కిలార్‌నెట్, డోలక్ వంటి వాయిద్యాల సంగీతమే ప్రాణమని ప్రముఖ రంగస్థల కళాకారుడు, రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జూనియర్ డీవీ సుబ్బారావు అన్నారు. వాడపాలెం పాత మార్కెట్ వీధి ఆది గణపతి నవ రాత్ర ఉత్సవ పందిరిలో సోమవారం రాత్రి సత్యహరిశ్చంద్ర, దేవనర్తకి నాటక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ రంగస్థల పౌరాణిక నాటక ప్రదర్శనల్లో 52 ఏళ్లుగా కిలార్‌నెట్ సంగీతం అందిస్తున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన గాజులపల్లి కృష్ణ ప్రతిభను గుర్తించిన గొలకోటి రాజు ఆ వేదికపై ఘనసన్మానం ఏర్పాటు చేశారు. అనంతరం డీవీ చేతుల మీదుగా కృష్ణను సన్మానించారు. ముందుగా జూనియర్ డీవీని నిలువెత్తు కరెన్సీ నోట్ల దండలతో సత్కరించారు. కళాకారిణి రత్నశ్రీ, ఉత్సవ కమిటీ సభ్యులు గనిశెట్టి చంద్రశేఖర్, బండారు భాస్కరరావు, సింగిరెడ్డి గోవిందుస్వామి, కురచ ప్రకాశరావు, కామిశెట్టి అమ్మన్న, పాలూరి సత్యానందం, చీకట్ల నాని వివిధ ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

**రంగస్థల దిగ్గజాలతో..**

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ నటులను ఏరికోరి తీసుకువచ్చి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. హరిశ్చంద్రునిగా, భవానీగా జూ.డీవీ సుబ్బారావు (వేట్లపాలెం), చంద్రమతిగా, దేవనర్తకిగా రత్నశ్రీ (కడప), గీతగా కుమారి (గుడివాడ), లీలాకుకుడుగా డీవీస్వీ రావు, శ్రీరంజనిగా సత్యప్రసాద్, సుబ్బారావుగా గుడివాడ సుబ్బారావు (తూర్పుగోదావరి జిల్లా) తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 112 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి

**రాజోలు:** రాష్ట్ర అభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్ మేళాలో మంగళవారం 112 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 14 కంపెనీలు హాజరు కాగా 271 మంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి 112 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధి అధికారిణి వసంతలక్ష్మి, జెడ్పీటీసీ మట్టా శైలజలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా స్థాయిలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో జాబ్‌మేళాలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులకు వ్యయం, కాల భారం తగ్గుతుందన్నారు. స్థానికంగా జరిగే జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ లోక్‌మాన్, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముంగిటకే వైద్య సేవలు



అంబాజీపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

**అంబాజీపేట:** ప్రజారోగ్యానికి మెరుగైన సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీసుకువచ్చారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పండువారిపేటలో వైద్యాధికారి కెఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా నెలలో రెండు సార్లు గ్రామానికి వచ్చి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తారన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోకుండా రోగుల వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయుష్మాన్‌భవ కార్డులను లబ్ధిదారులకు ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మైలా ఆనందరావు, కుడుపూడి సతీష్, ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



కె.జగన్నాథపురంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**అయినవిల్లి:** మండలంలో కె.జగన్నాథపురంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి యనమదల రాజలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పి.గన్నవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో, భారతదేశ చరిత్రలో «నారీ శక్తి వందన చట్టంలో» (33% మహిళా రిజర్వేషన్ బిల్లు) పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఆమోదం పొందిందని హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల పూర్తయినా చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం నిరాశకు గురి చేసిందని కానీ ప్రధాని మోదీ మహిళలపై ఉన్న గౌరవంతో పార్లమెంట్ భవనం ప్రారంభించిన సందర్భంగా 33% మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి తన నిబద్ధతను తెలియజేశారని కొనియాడారు. ఇది భారతమాతకు ఇచ్చిన గౌరవంగా మహిళలు అందరూ భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కె.శ్రీరామచంద్రమూర్తి, కుడుపూడి చంద్రశేఖర్, యనమదల వెంకటరమణ, మల్లిబాబు, ఆంజనేయుల, తానాల వెంకటేశ్వరరావు, పసలపూడి శ్రీనివాస్, రాజేష్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో నవీన్‌కు మూడో స్థానం



కోటిపల్లి నవీన్

**ఆత్రేయపురం:** మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన కోటిపల్లి నవీన్ రాష్ట్ర సాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-80 కేజీలు కేటగిరిలో 3వ స్థానం సాధించాడు. ఈనెల 24న శ్రీకాకుళంలో జరిగిన ఫ్లెక్స్ గౌరీ శంకర్ క్లాసిక్ ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించారు. 5 రాష్ట్రాలకు సంబంధించి ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నవీన్ 3వ స్థానం సాధించాడు. ఫ్లెక్సీ జిమ్ శ్రీకాకుళం అండర్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 3వ స్థానం దక్కించుకున్న నవీన్‌కు అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.స్వామినాయుడు, జనరల్ సెక్రటరీ టి.రామాంజనేయులు, ఆర్గనైజర్ కె.గౌరీ శంకర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. రావులపాలెం గోల్డెన్ జిమ్‌లో దండుప్రోలు రాజేష్ ద్వారా శిక్షణ పొందాడు. నవీన్ ఇంటర్మీడియెట్ చదవి తండ్రి దుర్గారావుకు పచ్చడి వ్యాపారం చేస్తుండటంతో అతనికి ఆసరాగా ఉంటాడు. కర్ణాటక, బెంగళూరు తదితర రాష్ట్రాల్లో పచ్చడి వ్యాపారం చేస్తుంటారు. నవీన్‌ను సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాల వెంకటరమణతో పాటు గ్రామస్తులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

## కొబ్బరికాయలకు మద్దతు ధర ఇవ్వాలి

**అంబాజీపేట:** కొబ్బరికాయలకు రూ.15 వేలు కనీస మద్దతు ధరను ప్రభుత్వాలు ప్రకటించి కొబ్బరి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతు సంఘ రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో ఉన్న కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కొబ్బరి రైతు సంఘ రాష్ట్ర నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొబ్బరి కాయలకు కనీస మద్దతు ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొబ్బరికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు మిల్లింగ్ కోప్రాకు రూ.10,860, బాల్ కోప్రాకు రూ.11,500 ఏ మాత్రం కొబ్బరి రైతులకు సరిపోదన్నారు. ఆర్బీకేల్లో సమస్యలు తలెత్తకుండా నాఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో కొబ్బరిని కొనుగోలు చేసి రైతులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ, పి.అచ్యుతరామయ్య, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



వీరవల్లిపాలెంలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న వైద్య బృందం

**ఆలమూరు:** పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. పెదపళ్ల, స్థానిక వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి అనారోగ్య బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పురస్కరించుకుని ఈనెల 30 నుంచి ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యసేవలను అందజేస్తామని ప్రజలకు వివరిస్తున్నారు. ఆ రెండు పీహెచ్‌సీల పరిధిలో 10845 మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 2654 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా పాల్గొన్నారు.

**అంబాజీపేట:** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఆరోగ్య రక్ష అని అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.గౌతమి, కె.ఎస్ శ్రీనివాస్, జి.రమ్య శైలజలు అన్నారు. మండలంలోని వాకలగరువు, తొండవరం, నందంపూడి, మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మంగళవారం వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సర్వేలో భాగంగా సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారి పలు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, ఎంపీహెచ్‌ఈఓలు పాల్గొన్నారు.

**అయినవిల్లి:** మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలో జగనన్న సురక్షను పీహెచ్‌సీ వైద్యుడు ఎన్.సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక, కొండుకుదురు, తొత్తరమూడి 1, మాగం, శానపల్లిలంక, క్రాప, తొత్తరమూడి-2, కె.జగన్నాథపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్నాయి. ఇప్పటివరకూ 6699 ఇళ్లను సందర్శించి బీపీ పరీక్షలు 2681, సుగర్ పరీక్షలు 2541, టీబీ 12, డెంగీ 9, మలేరియా 9, మూత్ర పరీక్షలు 7, హిమోగ్లోబిన్ 2742 పరీక్షలు నిర్వహించామని వైద్యుడు ఎన్.సునీల్ తెలిపారు. సర్వే అనంతరం మెడికల్ క్యాంపులు నిర్వహించి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యసేవలు త్వరలో అందిస్తామని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి టీంకు సురేష్, పూజిత



వాడపల్లి సురేష్



పెచ్చెట్టి పూజిత

**మలికిపురం:** మండలంలోని విశ్వేశ్వరాయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వాడపల్లి సురేష్ బాలుర విభాగంలోను, పెచ్చెట్టి పూజిత బాలికల విభాగంలోను త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం చింతా బాల చింతామణి మంగళవారం చెప్పారు. అనపర్తిలో జరిగిన పై పోటీల్లో వారు ఈ మేరకు విజయం సాధించారన్నారు.

### ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీని కలసిన ఎమ్మెల్యే రాపాక



విజయవాడలో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీని కలసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

**మలికిపురం:** రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మంగళవారం విజయవాడలో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీని కలిశారు. ఈ మేరకు ఇటీవల విశ్వేశ్వరాయపురంలో కుంగిన వంతెన విషయంపై ఈఎన్‌సీతో ఆయన చర్చించారు. వంతెన నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

### నేడు హుండీల ఆదాయం లెక్కింపు

**ఆత్రేయపురం:** పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఉమాకమండలేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి హుండీల ఆదాయం లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం ఉన్నతాధికారులు పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

### వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి మంగళవారం వేద పండితుల ఆధ్వర్యంలో శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు జరిపారు. భక్తులు సంప్రదాయం దుస్తుల్లో స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

### ఘనంగా మాస కల్యాణం

**ఆత్రేయపురం:** గ్రామంలో వేంచేసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాస కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం ఆలయ ఆవరణలో మాస కల్యాణం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణోత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకుడు గోరింట వినయ్ తదితరులు పర్యవేక్షించారు.

### 'నా నేల-నా దేశం' ర్యాలీ

**రాజోలు:** 'నా నేల-నా దేశం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజోలు దొరగారితోట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో, జాతీయ జెండాలు చేత పట్టుకుని ప్రదర్శించిన ప్రభాతభేరి కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం ప్రధానోపాధ్యాయిని వి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### 'ఆయుష్మాన్ భారత్'తో ఉచిత వైద్య సేవలు

**అంబాజీపేట:** ఏ రోగానికైనా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఏడాదికి రూ.5 లక్షలతో ఉచిత వైద్యం చేయించుకోవచ్చని సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ ఆధ్వర్యంలో పసుపల్లిలో ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు, వైద్యాధికారి రమ్యశైలజలు మాట్లాడుతూ ఈ కార్డులను నిరుపేదలు సద్వినియోగం చేసుకొని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

### రామరాజులంక పీఏసీఎస్ మహాజన సభ

**మలికిపురం:** మండలంలోని రామరాజులంక పీఏసీఎస్ మహాజన సభ మంగళవారం సొసైటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ చొప్పల రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. 766 మంది సభ్యులతో రూ.6 కోట్ల మేర రుణాలను రైతులకు ఇచ్చినట్టు ఆయన చెప్పారు. రూ.52 లక్షల మేర రైతుల నుంచి ఎఫ్‌డీలు సేకరించామన్నారు. సీఎం జగన్ రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.8 లక్షలు రుణం తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.350 చెల్లించి సొసైటీలో రైతులు సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు, సర్పంచ్ కాకర శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రవి, సొసైటీ డైరెక్టర్లు, సీఈవో పాల్గొన్నారు.

### సీజ్ చేసిన బియ్యానికి వచ్చే నెల 3న వేలం

**రావులపాలెం:** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలించడం నేరంగా పరిగణిస్తూ అధికారులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన బియ్యాన్ని వచ్చే నెల 3వ తేదీన స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.మృత్యుంజయరావు మంగళవారం తెలిపారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి భద్రపరిచిన 126.636 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు వేలం వేస్తున్నారన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.రెండు లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ జాయింట్ కలెక్టర్ పేరు మీద చెల్లే విధంగా డీడీని తీసి 3వ తేదీ ఉదయం 9 గంటల్లోపు సమర్పించి అదే రోజు ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం సీఎంఆర్ కార్యక్రమాలు సాగించే మిల్లర్లు ఈ వేలంలో పాల్గొనుటకు అనర్హులన్నారు.